సాక్షి సంగారెడ్డి
9
ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025

పూల పండుగ..

సండే స్పెషల్

ఆధ్యాత్మిక సంరంభానికి తెరలేచింది. ఉత్సవాల నెలవు అశ్వయుజ మాసం పండుగలను మోసుకొచ్చింది. దసరా శరన్నవరాత్రోత్సవాలు, బతుకమ్మ పండుగ సంబురాలతో భక్తి పారవశ్యం, ఉత్సాహభరిత వాతావరణం అలుముకోనుంది. వేదఘోష, విశేషపూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరియనున్న నేపథ్యంలో ఈ వారం సాక్షి కథనం.

- వర్గల్(గజ్వేల్):

8లో



ఘనంగా బతుకమ్మ సంబురాలు



నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

జిల్లాలో బతుకమ్మ వేడుకలు అంగరంగవైభంగా మొదలయ్యాయి. మహిళలు పూలను చేర్చి బతుకమ్మలు ఆడుతున్నారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా శనివారం సదాశివపేట మండలంలోని నిజాంపూర్ (కే) ప్రభుత్వ పాఠశాలలో, సదాశివపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి తొమ్మిది రోజుల పండుగ విశిష్టతను తెలిపే బతుకమ్మలతో పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లులతో కలిసి కోలాటం, బతుకమ్మలు ఆడి పాడారు.

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి):



సదాశివపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

న్యూస్‌రీల్

ఆదినారాయణస్వామిని దర్శించుకున్న అదనపు కలెక్టర్



ఆలయ ప్రాంగణంలోని గుండాన్ని వీక్షిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం పట్టణ పరిధిలోని కొడకంచి శ్రీ ఆదినారాయణ స్వామి ఆలయాన్ని శనివారం అదనపు కలెక్టర్ మాధురి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవదాస్, ఆలయ ఫౌండర్ రామోజీరావు, నాయకులు వడ్డె కృష్ణ, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఎఫ్‌తో విస్తృత తనిఖీలు

ఎస్పీ పరితోశ్ పంకజ్

పటాన్‌చెరు: అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లాలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్)ను ఏర్పాటు చేశామని, ఈ బృందాలు జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తాయని ఎస్పీ పరితోశ్ పంకజ్ వెల్లడించారు. శనివారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో వివిధ 20 కేసులలో సీజ్ చేసిన ప్రభుత్వ నిషేధిత 583 కిలోల ఎండు గంజాయి, 1.777 కిలోల ఆల్ప్రాజోలం, 980 గ్రాముల ఎండీఎంఏను కోర్టు అనుమతితో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...జిల్లాలో ఎవరైనా మత్తు పదార్థాలను విక్రయించినా, సరఫరా చేసినా, లేదా సాగు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్తయ్యగౌడ్, పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, వర్టికల్ డీఎస్పీ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు: డీఈఓ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ అభ్యాసకులకు ఈ నెల 22 నుంచి 28వ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రెగ్యూలర్ పరీక్షల మాదిరిగానే ఓపెన్ పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు డీఈఓ తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్ అభ్యాసకులకు సంగారెడ్డిలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో, పదో తరగతి అభ్యాసకులకు బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను వెనక్కి తీసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం

కొండాపూర్(సంగారెడ్డి): రియల్ ఎస్టేట్ వెంచర్లు, బడా బాబుల ప్రయోజనాల కోసం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడం దారుణమని, వెంటనే దాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన కొండాపూర్‌ని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మరేపల్లి, రాంపూర్ తండా , గోటీల గుట్ట, మాచెపల్లి, గంగారం, శివన్న గూడెం, అలియాబాద్, తొగర్‌పల్లి, గిర్మాపూర్ గ్రామాల్లో రీజనల్ రింగ్ రోడ్ కోసం రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో భూ నిర్వాసితులను ఏకం చేసి రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య, నాయకులు బాబురావు పాల్గొన్నారు.

27 లక్షల క్వింటాళ్లు.. 24 కేంద్రాలు

- పత్తి కొనుగోళ్లకు కార్యాచరణ ప్రణాళిక ఖరారు
- అక్టోబర్ మూడో వారం నుంచి పత్తి రాక మరువయ్యే అవకాశం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఈసారి పత్తికొనుగోళ్లకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. వచ్చే నెల మూడో వారం నుంచి మార్కెట్‌లోకి పత్తి వచ్చే అవకాశాలుండటంతో ఈ ప్రణాళికపై అధికారులు దృష్టి సారించారు. ఈసారి జిల్లావ్యాప్తంగా 24 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతేడాది మాదిరిగానే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తిని కొనుగోలు చేయనుంది. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజనులో 3.48 లక్షల ఎకరాల్లో పత్తి సాగైనట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఈసారి సుమారు 27.90 లక్షల క్వింటాళ్ల పత్తి పండుతుందని ఆశాఖ అంచనా వేసింది. రాష్ట్రంలో పత్తి పండించే ప్రధాన జిల్లాలో సంగారెడ్డి ఒకటి. ఈసారి పత్తి కనీస మద్దతు ధర క్వింటాళ్లకు రూ.8,110గా ప్రభుత్వం నిర్ణయించింది. స్టేపుల్ లెన్త్‌ను బట్టి ఈ రేటు ఉంటుంది. నిర్ణీత తేమ శాతానికి మించితే కొనుగోలు చేసేందుకు సీసీఐ నిరాకరిస్తుంది.

24 కొనుగోలు కేంద్రాలు..

జిల్లాలో ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. వీటి పరిధిలో ఈసారి మొత్తం 24 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అత్యధికంగా ఖేడ్ మార్కెట్ కమిటీ పరిధిలో తొమ్మిది కేంద్రాలు, రాయికోడ్ మార్కెట్ కమిటీ పరిధిలో ఐదు కేంద్రాలు, జోగిపేట పరిధిలో నాలుగు కేంద్రాలు, సదాశివపేట పరిధిలో మూడు కేంద్రాలు, జహీరాబాద్ పరిధిలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావించారు. జిన్నింగ్ మిల్లు ఉన్న చోట్ల ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో జిన్నింగ్ సామర్థ్యం రోజుకు 220 బెయిళ్ల నుంచి 400 బెయిళ్ల వరకు జిన్నింగ్ చేస్తుంది. వీటి పూర్తి జిన్నింగ్ సామర్థ్యం రోజుకు 7,280 బెయిళ్లుగా లెక్కించారు.

గతేడాది సీసీఐ కొన్నది 33 శాతమే..

పత్తి రైతుకు కనీస మద్దతు ధర అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పత్తిని కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. గతేడాది జిల్లాలో పండిన పత్తిలో సీసీఐ కొనుగోలు చేసింది కేవలం 34% కావడం గమనార్హం. మిగితా 66% ప్రైవేటు ట్రేడర్లు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలే కొనుగోలు చేశాయి. గతేడాది సీసీఐ కొనుగోళ్లను పరిశీలిస్తే..14.13 లక్షల క్వింటాళ్ల కొనుగోలు చేశారు. ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు వచ్చిన పత్తిని కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. అలాగే మహారాష్ట్ర, కర్ణాటకల్లోని మిల్లులకు కూడా పత్తిని వ్యాపారులు తరలిస్తుంటారు.

దెబ్బతిన్న పత్తి

మునిపల్లి(అందోల్): ఇటీవల తరచూ పడుతున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పత్తి పంట దెబ్బతింటోంది. పంట దిగుబడి కోసం పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. తరచూ వర్షం పడుతుండటంతో మొలకలకున్న పత్తి వర్షం నీటికి కింద కారిపోయి పనికి రాకుండా పోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి పంటలో నీరు నిలవడంతో పత్తి మొలకలు ఎండిపోయి పనికి రాకుండా పోతున్నాయి. వివిధ రకాల పిచ్చి మొక్కలు, ఇగుడ పత్తి మొలకలకంటే ఎక్కువగా ఉండటంతో పత్తిలో గడ్డి మందు పిచికారీ చేసినా ఉపయోగం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు.

ఎకరాకు ఎనిమిది క్వింటాళ్లే

ఈసారి పత్తి దిగుబడి ఎకరాకు ఎనిమిది క్వింటాళ్లే వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. గతేడాది ఎకరానికి 12 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుందని లెక్కించారు. కానీ ఆ స్థాయిలో దిగుబడి రాలేదు. దీంతో ఈసారి ఏకంగా మూడో వంతు మాత్రమే దిగుబడి వస్తుందని అంచనాకు వచ్చారు. ఈసారి భారీ వర్షాల కారణంగా పత్తి పూర్తిగా దెబ్బతింది. చాలావరకు పత్తి పంట రంగు మారింది. మరోవైపు యూరియా కొరత కూడా ఈ పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సకాలంలో యూరియా వేయకపోవడంతో దిగుబడి తగ్గడానికి ఓ కారణమనే రైతులు చెబుతున్నారు.

దసరా ఉత్సవాలకు కేతకీ ముస్తాబు

- రోజుకో రూపంలో అమ్మవారి దర్శనం
- 11 రోజులపాటు ప్రత్యేక పూజలు
- సంతరించుకోనున్న ఆధ్యాత్మిక శోభ



ఝరాసంగంలోని శ్రీ కేతకీ సంగమేశ్వరాలయం

ఝరాసంగం(జహీరాబాద్): విజయదశమి పండుగను పురస్కరించుకుని శ్రీకేతకీ సంగమేశ్వరాలయంలో శ్రీ దుర్గాదేవీశరన్నవరాత్రి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

శరన్నవరాత్రులలో అలంకరణలు, పూజలు

దుర్గాదేవి 11 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో రోజుకోరూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ప్రతీరోజు అమ్మవారికి విశేష అలంకరణలో దర్శనం ఇచ్చి ప్రత్యేక పూజలు అందుకోనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ప్రాతఃకాల సమయంలో అమ్మవారికి అభిషేకాలంకరణ, విఘ్నేశ్వర పూజ, చతుష్టి సహిత అవరణార్చనలు, లలిత హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి.

విశేష అవతారాల్లో అమ్మవారి దర్శనం

ఈనెల 22 నుంచి అక్టోబర్ 10 వరకు కొనసాగుతాయి. శ్రీ మంగళగౌరీ, శ్రీగాయత్రీ, శ్రీ అన్నపూర్ణ, శ్రీ బాలా త్రిపుర సుందరి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ కాత్యాయని, శ్రీ చాముండేశ్వరి, శ్రీ మహాసరస్వతి, శ్రీ దుర్గాదేవి, శ్రీ మహిషాసురమర్దిని, శ్రీ రాజరాజేశ్వర దేవి రూపంలో ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

మంజీరా ప్రాజెక్టుపై కలెక్టర్ ప్రావీణ్య



మంజీరా డ్యామ్‌ను సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి టౌన్/ సంగారెడ్డి జోన్: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మంజీరా బ్యారేజ్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా పర్యావరణ పరిరక్షణ, విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. సంగారెడ్డి కలబ్‌గూర్ సమీపంలోని మంజీరా బ్యారేజ్‌ను, మంజీరా డ్యామ్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంజీరా బ్యారేజ్ ప్రాంతాన్ని భవిష్యత్తులో విద్యార్థులకోసం సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాలకు ఉపయోగపడేలా అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజ్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో నాలుగు క్రస్టు గేట్ల ద్వారా కిందికి వదులుతున్న నీటిని కలెక్టర్ పరిశీలించారు.

సమన్వయంతో భూసేకరణ

జాతీయ రహదారుల నిర్మాణ పనులకు అవసరమైన భూసేకరణ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కొనసాగుతున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తోపాటు అధికారులు పాల్గొని మాట్లాడారు. త్వరలో రహదారుల నిర్మాణం విస్తరణ పనులపై రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.



జగ్గారెడ్డి దంపతులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ అధికారులు

డిగ్రీ కాలేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు

- విద్యార్థినులకు సరిపడా హాస్టల్ భవనం కూడా..
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సంగారెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో వెయ్యి మంది విద్యార్థినులకు సరిపడా భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. తరగతి గదులు, గ్రంథాలయం, కంప్యూటర్‌ల్యాబ్, సైన్స్‌ల్యాబ్‌లు, ఆడిటోరియం వంటివి నిర్మిస్తామన్నారు. ఈ డిగ్రీ కాలేజీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ...ఈ కాలేజీలో చదువుకునే విద్యార్థినులకు వెయ్యి మందికి సరిపడా వసతి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన హాస్టల్ భవనాన్ని కూడా నిర్మిస్తామన్నారు. డైనింగ్ హాల్‌తో పాటు, గదులు విశాలంగా ఉండేలా నిర్మించాలన్నారు. అక్టోబర్ 10 వరకు ఈ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిస్తామని తెలిపారు. అవసరమైతే ప్రైవేటు సంస్థల సీఎస్ఆర్ నిధులను వినియోగించుకుంటామని చెప్పారు. టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి కూడా ఇదే కాలేజీలో చదువుకున్నారని జగ్గారెడి గుర్తు చేశారు.

డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జిన్నారం (పటాన్‌చెరు): జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో గుమ్మడిదల విద్యార్థులు సత్తాచాటి డివిజన్ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పౌలీణ శనివారం మీడియాకు వెల్లడించారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో బాలికల అండర్ -14 విభాగంలో 9వ తరగతి విద్యార్థులు అక్షిత, సీమాబేగం, 8వ తరగతి విద్యార్థిని వర్షిత ప్రథమ స్థానంలో గెలుపొంది డివిజన్ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారిని క్రీడల్లో ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్‌ను అభినందించారు.

ఖేడ్ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్పష్టం చేశారు. ఖేడ్ మండలం చల్లగిద్ద తండాలో శనివారం అంగన్‌వాడీ కేంద్రం భవనం, మురుగు కాల్వ, పాఠశాల ప్రహరీ నిర్మాణం, హుంగ్రానా(జి)లో రూ.20 లక్షలతో పంచాయతీ భవనం, రూ.12 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామాల్లో మౌలిక సదుపాయాలతోపాటు విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. చల్లగిద్ద తండాలో భవానీమాత దీక్షాధారులతో కలిసి భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొని ఆలయాల్లో పూజలు చేశారు. హుంగ్రానా(జి) గ్రామానికి చెందిన 20 మంది బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు రమేశ్ చౌహాన్, దారంశంకర్, గురునాథ్, పండరీనాయక్, సంగన్న, పండరిరెడ్డి, శ్రీకాంత్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలి

బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చడమే విద్యార్థుల లక్ష్యం కావాలని సంజీవరెడ్డి సూచించారు. ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆచార్య జయశంకర్ డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఆయాకళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీటు కోసం కిటికీ నుంచి బ్యాగ్ వేస్తున్న యువతులు



బస్సు ఎక్కేందుకు కుస్తీలు పడుతున్న ప్రయాణికులు



బాలికల వసతి గృహం నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు



సంగారెడ్డి కొత్త బస్టాండ్‌లో బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు



కూతురిని ఇంటికి తీసుకు వెళ్తున్న తల్లి

సొంతూళ్లకు పయనం

ప్రభుత్వ పాఠశాలలకు, సంక్షేమ హాస్టళ్లకు దసరా సెలవులు రావటంతో విద్యార్థులంతా శనివారం సొంతూళ్లకు పయనమయ్యారు. తల్లిదండ్రులు వచ్చి వారి పిల్లలను వెంట పెట్టుకుని తీసుకెళ్లారు. పదిహేను రోజులపాటు సెలవులు రావటంతో తల్లిదండ్రులు వారి పిల్లలతో కలిసి ఇళ్లకు బయల్దేరారు. దీంతో సంగారెడ్డి కొత్త బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. బస్సుల కోసం జనం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. బస్సు వచ్చినా సీట్లు దొరక్క చాలామంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి/ ఝరాసంగం (జహీరాబాద్):

పూల పండుగ.. అమ్మకు అర్చన

క్లుప్తంగా

విద్యార్థిని చితకబాదిన టీచర్



గాయాలైన విద్యార్థి

చిన్నకోడూరు(సిద్దిపేట): అకారణంగా విద్యార్థిని చితకబాదిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు శనివారం ఎంఈఓ యాదవరెడ్డికి ఫిర్యాదు చేశారు. బాధిత విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని రామంచ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉపాధ్యాయుడు సలీమ్ విద్యార్థిని అకారణంగా చితకబాదాడు. గతంలో కూడా ఈ టీచర్ ఇలానే కొట్టాడని పేర్కొన్నాడు. దీంతో ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయడంతో కక్ష పెట్టుకున్నాడని వాపోయాడు. అకారణంగా గాయపర్చిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సతీశ్‌ను వివరణ అడగగా సలీమ్ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నాడని, అతడ్ని విధుల్లోంచి తొలగించామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

రేగోడ్(మెదక్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఏఎస్‌ఐ శంకర్, పోలీసులు సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పోచారం చౌరస్తా వద్ద పెద్ద తండా నుండి నారాయణఖేడ్ వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో దాదాపు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తుండగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం సివిల్ సప్లై అధికారులు రేషన్ బియ్యాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న మెగావత్ రాజుపై కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిజాంపేట(మెదక్): పేకాట ఆడుతున్న ఏడుగురిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేశ్ కథనం ప్రకారం... మండల పరిధిలోని వెంకటాపూర్ (కె) గ్రామ శివారులో గోపరి రమేశ్‌కు చెందిన పౌల్ట్రీ ఫామ్‌లో అతడితో పాటు పేకాట ఆడుతున్న కుక్కుదు నవీన్, గువ్వలెగి రమేశ్, కుక్కుదు రమేశ్, చిగుల్లా మధు, గోపరి నాగరాజు, కుక్కుదు అనిల్‌ను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 50,960 నగదు, 6 సెల్ ఫోన్లు, 2 బైక్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వీరిని శనివారం సత్ప్రవర్తన గురించి సంవత్సర కాలం పాటు తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

గోవా మద్యం స్వాధీనం



ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

జహీరాబాద్ టౌన్: గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐ.కోటేశ్వర్ గౌడ్ వివరాల ప్రకారం...జిల్లా సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర ఆదేశాల మేరకు శనివారం మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేశారు. ఈ క్రమంలో ట్రావెల్స్ బస్సు, తదితర వాహనాల్లో తరలిస్తున్న వివిధ బ్రాండ్స్‌కు చెందిన 36 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

పారిశుద్ధ్య కార్మికురాలు ఆత్మహత్యాయత్నం

నిజాంపేట(మెదక్): అధికారి వేధింపులు భరించలేక పారిశుద్ధ్య కార్మికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రంలో కొమ్మాట ఇందిర 12 ఏళ్లుగా గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలుగా విధులు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో మూడు నెలల నుంచి జీతాలు చెల్లించే విషయంలో పంచాయతీ కార్యదర్శి నర్సింలు ఇబ్బందులకు గురిచేస్తూ జీతం ఇవ్వడం లేదు. దీంతో మనస్తాపం చెందిన ఇందిర శనివారం మధ్యాహ్నం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం నార్సింగ్ ఆస్పత్రికి తరలించారు.



బతుకమ్మలతో మహిళలు

ఆధ్యాత్మిక సంరంభానికి తెరలేచింది. ఉత్సవాల నెలవు అశ్వయుజ మాసం పండుగలను మోసుకొచ్చింది. దసరా శరన్నవరాత్రోత్సవాలు, బతుకమ్మ పండుగ సంబురాలతో భక్తి పారవశ్యం, ఉత్సాహ భరిత వాతావరణం అలుముకోనున్నది. వేదఘోష, విశేష పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరియనున్న నేపథ్యంలో ఈ వారం సాక్షి కథనం.
- వర్గల్(గజ్వేల్):

- గౌరారం విజయ్‌రావు

దసరా నవరాత్రోత్సవాల వైభవం

- బతుకమ్మ సంరంభం
- ఆధ్యాత్మికతల అశ్వయుజ మాసం
- ఎల్లెడలా పండుగ వాతావరణం

శరదృతువులో ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సోమవారం నుంచి నవమి వరకు భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజులపాటు నవ రూపాల్లో విశేషాలంకరణలో సకల శక్తిస్వరూపిణి అమ్మవారిని పూజించేందుకు ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, గ్రామాల్లో అమ్మవారి మండపాలు ముస్తాబయ్యాయి. మరోవైపు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక బతుకమ్మ పండుగ ఆదివారం నుంచి ప్రారంభమవుతుండగా.. పూల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు తరుణీమణులు సిద్ధమవుతున్నారు.

దసరా శరన్నవరాత్రోత్సవ వైభవం..

ఆశ్వయుజ మాసంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా సకల శక్తి స్వరూపిణి ఆదిపరాశక్తి, జగన్మాతను తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఉత్సవాల తొలిరోజు 22న సోమవారం బాలాత్రిపురసుందరిగా, 23న గాయత్రీదేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా, 25న కాత్యాయనిదేవిగా, 26న మహాలక్ష్మిగా, 27న లలితా త్రిపురసుందరిగా, 28న మహాచండీ, 29న మహాసరస్వతిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబర్1న మహిషాసుర మర్దినిగా, 2న రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు సేవలందుకుంటారని వేదపండితులు పేర్కొన్నారు. శరన్నవరాత్రోత్సవాలకు రాష్ట్రంలో రెండో బాసరగా పేరొందిన వర్గల్ శ్రీవిద్యాసరస్వతి ఆలయంతోపాటు తదితర ప్రముఖ ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

పూల పండుగ.. బతుకమ్మ

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగకు విశిష్ట స్థానం ఉన్నది. భాద్రపద అమావాస్య నుంచి తొమ్మిది రోజుల సంరంభం మొదలవుతుంది. చివరిరోజు సద్దుల బతుకమ్మతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. బతుకమ్మను పేర్చడం ఒక ఆనవాయితీ. ప్రకృతిలో లభించే గునుగు, తంగేడు, పట్టుకుచ్చులు, బంతి, చేమంతి తదితర పూలను సేకరించి, పళ్లెంలో గుమ్మడి ఆకులపై పూలను కళాత్మకంగా పేర్చి బతుకమ్మను తీర్చిదిద్దుతారు. ఈ పండుగను బాలికలు, మహిళలు ఉత్సాహంగా జరుపుకుంటారు. కొత్త దుస్తులు, రకరకాల ఆభరణాలు అలంకరించుకుని ముస్తాబవుతారు. ప్రతి నిత్యం గ్రామ కూడళ్లలో బతుకమ్మలను పెట్టి లయబద్ధమైన చప్పట్లతో తిరుగుతూ ఉయ్యాల పాటలు పాడుతారు.



పేర్చిన బతుకమ్మతో మహిళలు

తొమ్మిది రోజులు.. తొమ్మిది పేర్లతో..

బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులు, తొమ్మిది పేర్లతో జరుపుకుంటారు. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడోరోజు ముద్దపప్పు బతకమ్మ, నాలుగో రోజు ముత్యాల బతకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలిగిన బతుకమ్మ, ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదోరోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా సంబురాలు జరుపుకుంటారు. ప్రాంతాలను బట్టి పేర్లలో కొన్ని తేడాలుంటాయని పండితులు చెబుతున్నారు.

ప్రకృతిలో పూల వాతావరణం

బతకమ్మ పండుగ వచ్చే తరుణంలో ప్రకృతిలో మార్పులు కనపడతాయి. ప్రకృతి రకరకాల పూలతో అలంకరించుకుంటున్నట్లు ఉంటుంది. చెరువులు, జలాశయాలు నీటితో నిండుగా మారుతాయి. బతుకమ్మ ఆడి నీటిలో వదిలిన తర్వాత చెరువులు పూల సోయగంతో అలరారుతాయి. జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు పూల పండుగ బాసటగా నిలుస్తుంది. అమ్మవారి శరన్నవ రాత్రులతో బతుకమ్మ పండుగకు అవినాభావ సంబంధం కన్పిస్తుంది. తొమ్మిది రోజులు తొమ్మిది రకాల పేర్లతో బతుకమ్మను ఆరాధిస్తారు.



వర్గల్ మండలం చౌదరిపల్లిలో బంతిపూల తోట

బతుకమ్మ గౌరీదేవి స్వరూపం

బతుకమ్మ గౌరమ్మ స్వరూపమని, ఈ అమ్మవారు పసుపు కుంకుమలతో నిండా నూరేళ్లు బతకమని ఆశీర్వదిస్తుందని ప్రజల నమ్మకం. అందుకే బతుకమ్మను ఆటగా కాకుండా ఆరాధనగా, పూజగా జరుపుకుంటారు. బతుకమ్మలకు, గౌరమ్మను చేర్చి ధూపాలు, దీపాలు, నైవేద్యాలు అందించి భక్తి ప్రపత్తులతో ప్రదక్షిణలు చేసి గంగమ్మ ఒడికి చేరుస్తారు.



ఆలయంలో సరస్వతి అమ్మవారు

విశేషమైన సద్దుల బతుకమ్మ

సద్దుల బతుకమ్మను విశేషంగా భావిస్తారు. ఆ రోజు వీలైనంత ఎక్కువ ఎత్తులో బతుకమ్మను పేర్చుతారు. రంగురంగుల వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. ఇందులో మహిళలకు పురుషులు తోడ్పాటుగా నిలుస్తారు. మొక్కజొన్నలు, పెసర్లు మొదలైన ఆయా ప్రాంతాల్లో పండిన ధాన్యాలతో పాటు, చింతపండు, నిమ్మకాయ, పెరుగు, నువ్వులు, కొబ్బరి తదితరాలతో సద్దులు చేసి బతుకమ్మకు నివేదిస్తారు.

పెత్తర అమావాస్య ఉయ్యాలో...



పెత్తర అమావాస్య సందర్భంగా గతించిన తమ పెద్దల పేరిట బ్రాహ్మణులకు బియ్యం, కాయగూరలు దానం చేస్తున్న దృశ్యం

దుబ్బాక: భారతీయ సంస్కృతి మనకు ముందుగా నేర్పింది. మాతృదేవోభవ, పితృదేవోభవ. ఆ తర్వాతే ఆచార్యుడైనా, అతిథి అయినా, చివరకు దేవతలైనా సరే కన్నతల్లిదండ్రులను మొదటగా పూజించాలి. మరణించిన మన వంశోద్ధారకుల కోసం ఏడాదిలో భాద్రపద మాసం బహుళ పక్షంలోని 15 రోజులు మహాలయ పక్షంగా పరిగణిస్తారు. మన మూలాలను మనకు గుర్తు చేసే మంచి సమయం పితృపక్షం. మొన్నటి పున్నమి తెల్లవారి పాడ్యం నుంచి వచ్చే అమావాస్య వరకు మన వంశవృక్షాన్ని పెంచి పెద్ద చేసిన మాతృ, పితృ దేవతలంతా కొలువు దీరే కాలం ఆఖరిరోజు పెత్తర అమావాస్య. ఏడాదికి ఒక్కసారి వచ్చే అమావాస్యను చాల గొప్పరోజుగా జరుపుకుంటారు.

ముఠాగా ఏర్పడి చోరీలు

ముగ్గురు నిందితుల రిమాండ్



నిందితుల వివరాలు వివరిస్తున్న ఎస్‌ఐ లింగం

నర్సాపూర్: వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. శనివారం ఎస్‌ఐ లింగం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని ఎర్రకుంట తండాకు చెందిన ముడావత్ అంజ్య, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నెల్లూరు జిల్లాకు చెందిన చిల్లకూరి కృష్ణ, టేక్మాల్ మండలానికి చెందిన నెమలి శ్రీనివాస్ ముఠాగా ఏర్పడి చోరీలు చేస్తున్నారు. కాగా ఉదయం స్థానిక చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకొని విచారించగా చోరీలు చేసినట్లు అంగీకరించారు. నర్సాపూర్‌లో ఇటీవల మూడు దుకాణాల్లో చోరీకి పాల్పడి రెండు దుకాణాల నుంచి అపహరించిన 20తులాల వెండి బిళ్లలు, రూ.2వేలు, ఇతర వస్తువులు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. చోరీ చేసిన సొమ్ముతోపాటు టీవీఎస్ జూపిటర్, ఇనుప రాడ్లు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా పలు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లారని, అక్కడే పరిచయం ఏర్పడి జైలు నుంచి విడుదల కాగానే ముగ్గురు కలిసి దొంగతనాలకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు.

మరో చోరీ కేసులో...

వారం క్రితం మండలంలోని నారాయణపూర్ గ్రామంలో ఆరు ఇండ్లలో చోరీ చేసిన నిందితున్ని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు. కొల్చారం మండలం నాయిని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన నీరుడి కృష్ణ చోరీకి పాల్పడ్డాడని, అతని వద్ద నుంచి సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

శవానికి రీ పోస్టుమార్టం



మునిపల్లిలో అనుసూజ మృతదేహం బయటకు తీస్తున్న పోలీసులు

మునిపల్లి(అందోల్): పద్దెనిమిది నెలల క్రితం అంత్యక్రియలు నిర్వహించిన మృతదేహానికి మళ్లీ రీ పోస్టుమార్టం చేశారు. సదాశివపేట సీఐ వెంకటేశ్ వివరాల ప్రకారం.. మునిపల్లి గ్రామానికి చెందిన అనుసూజ (53)ను అదే గ్రామానికి చెందిన బస్వరాజ్ 18 నెలల క్రితం (2024 మే 20న) ఏడుపాయలలో హత్య చేశాడు. గత సవంత్సరం మేలో మహిళ అదృశ్యమై అదే నెలలో పాపన్నపేట మండలం ఏడుపాయలలో మృతదేహం లభ్యమైంది. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా అంత్యక్రియలు కూడా నిర్వహించారు. అనంతరం మృతురాలి కుమారుడికి డీఎన్‌ఏ పరీక్ష నిమిత్తం వైద్యాధికారులు మృతదేహం నుంచి కావలసిన రక్త నమూనాలను సేకరించి కొడుకు ప్రవీణ్‌కు డీఎన్‌ఏ టెస్టు నిర్వహించగా మాచ్ కాలేదు. దీంతో శనివారం మునిపల్లిలో రెండోసారి మహిళ సమాధి తవ్వి మృతదేహం నుంచి డీఎన్‌ఏ పరీక్షలకు కావల్సిన ఎముకలను సంగారెడ్డి మెడికల్ కాలేజీ డాక్టర్ రాము ఆధ్వర్యంలో తీసుకున్నారు. తహసీల్దార్ గంగాభవాని, బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్, ఆర్‌ఐ సుభాష్ ఉన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

- డీఎస్పీ నరేందర్‌గౌడ్
- క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో పలు సూచనలు



క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్: పోలీసు స్టేషన్లలో పెండింగ్ కేసులు లేకుండా త్వరగా పరిష్కరించాలని డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్ల సీఐ, ఎస్‌ఐలతో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వివిధ నేరాలపై సమీక్ష జరిపి, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. విచారణలో ఉన్న కేసులు, న్యాయస్థానాల్లో ట్రయల్ పెండింగ్‌లో ఉన్న కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరితగతిన తగ్గించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఇవి నేరాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అలాగే గంజాయి, జూదం ఇతర అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదని, ఇలాంటి వాటిని నిరోధించడానికి పహారా బలపరచాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల ఏర్పాట్లు పటిష్టం చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తూప్రాన్, రామయంపేట, నర్సాపూర్ సీఐలు రంగాకృష్ణ, వెంకట్ రాజాగౌడ్, జాన్‌రెడ్డి, ఎస్‌ఐ పాల్గొన్నారు. కాగా అంతకు ముందు తూప్రాన్ పోలీస్ సర్కిల్ పరిధిలోని సిబ్బందితో పట్టణంలో ఓ పాఠశాల ఆవరణలో పరేడ్ నిర్వహించారు.

ట్రాక్టర్, బైక్ ఢీ..

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీశైలం వివరాల ప్రకారం... ఇంద్రేశం సిటిజన్ కాలనీకి చెందిన నందకుమార్ (22) అతడి బావ లక్ష్మణ్ వద్ద ఉంటూ పాశమైలారం పారిశ్రామికవాడలో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం డ్యూటీకి బైక్‌పై వెళ్తుండగా ముత్తంగి సర్వీస్ రోడ్డులో జీపీఆర్ వెంచర్ నుంచి రోడ్డు పైకి పటాన్‌చెరు వైపు వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నందకుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి బావ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అదుపు తప్పి.. చెట్టును ఢీకొట్టి..

కొల్చారం(నర్సాపూర్): వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఎనగండ్ల గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కొరబోయిన శ్రీశైలం(32) దుంపలకుంట చౌరస్తాలో పంక్చర్ దుకాణం నడుపుతూ భార్య పిల్లలతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాత్రి గిరాకీ ఉండటంతో ఇంటికి వెళ్లడం ఆలస్యమైంది. పని ముగియగానే తన బైక్ పై ఇంటికి వస్తున్నాడు. గ్రామ శివారులోని మామిడి చెరువు కట్ట వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో శ్రీశైలం తలకు, ఇతర భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఐదేళ్లలోపు కూతురు, కుమారుడు ఉన్నారు.

యువతి అదృశ్యం



లున్సావత్ కవిత

నర్సాపూర్ రూరల్: ఓ యువతి అదృశ్యమైంది. ఎస్సై లింగం వివరాల ప్రకారం.. మండలంలోని కోక్య తండాకు చెందిన లున్సావత్ బిక్యా కూతురు కవిత(21) ఈనెల 18న రాత్రి నుంచి కనిపించకుండా పోయింది. అదే రోజు కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

కొమురవెల్లి(సిద్దిపేట): ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని గౌరాయపల్లి గ్రామానికి చెందిన పెద్ది మధుసూదన్ రెడ్డి(24) వ్యవసాయ పనుల నిమిత్తం మధ్యాహ్నం తన పొలం దగ్గరకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కొట్టు మిట్టాడుతుండగా స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఇంత వరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

పట్టపగలే దారి దోపిడీ

- తల్లీకొడుకులను అడ్డుకుని ఆరు తులాల బంగారు నగలు అపహరణ
- దుండగుడి దాడిలో కొడుకుకు గాయాలు



మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్లాగౌడ్

మద్నూర్(జుక్కల్): కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రానికి సమీపంలో శనివారం పట్టపగలే జరిగిన దారి దోపిడీ స్థానికంగా కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మల్లయ్యగారి ఎల్లాగౌడ్, అతని తల్లి సీతమ్మ కలిసి బైక్‌పై మద్నూర్‌లో జరిగే ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు బయలుదేరారు. మద్నూర్ సమీపంలో జాతీయ రహదారి 161 నుంచి మద్నూర్ వైపునకు వచ్చే సర్వీస్ రోడ్డుపైకి రాగానే వెనక నుంచి బైక్‌పై హెల్మెట్‌లు ధరించిన ఇద్దరు వేగంగా వచ్చి తల్లీ కొడుకులను అడ్డుకున్నారు. కత్తి తీసి బెదిరించి సీతమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలను ఇవ్వాలన్నారు. దీంతో సీతమ్మ కొడుకు ఎల్లాగౌడ్ అడ్డుకోగా తోపులాట జరిగింది. ఇద్దరు దుండగులలో ఒకరి హెల్మెట్ కింద పడిపోయింది. దీంతో దుండగుడు కత్తితో ఎల్లాగౌడ్‌పై దాడి చేసి చంపేస్తామని బెదిరించాడు. అప్పటికే ఎల్లాగౌడ్ చేతికి గాయం కావడంతో భయపడిన సీతమ్మ తన ఒంటిపై గల నాలుగు తులాల బంగారు నెక్లెస్, రెండు తులాల పుస్తెల తాడు దుండగులకు ఇచ్చేసింది. నగలను తీసుకుని వారు పారిపోయారు. సమాచారం అందుకున్న స్థానికులు తల్లీకొడుకులను మద్నూర్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. ఎస్సై విజయ్‌కొండ, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. ఈ దారి దోపిడీ ఘటనతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

దశదినకర్మ కెళ్లి స్నానం చేస్తుండగా..

చెరువులో మునిగి యువకుడు మృతి



రమేశ్

చిన్నశంకరంపేట(మెదక్): స్నానం చేసేందుకు వెళ్లిన యువకుడు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని సూరారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బీపేట రమేశ్(32) కుటుంబ సభ్యులతో కలిసి పెదనాన్న దశదినకర్మలో పాల్గొనేందుకు వెళ్లాడు. రెడ్డిచెరువు వద్ద తలవెంట్రుకలు తీసుకుని చెరువులో స్నానం చేసేందుకు దిగాడు. ఈ క్రమంలో రమేశ్ ప్రమాదవశాత్తు చెరువులోని గుంతలో జారి పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చెరువులోంచి బయటకు తీసినప్పటికీ అతడు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ఇలియాస్ గౌస్, షారుక్‌ఖాన్ కలిసి ఒడిశా నుంచి గంజాయి తీసుకొని ముంబైకి బయలుదేరారు. మాదాపూర్ ఎస్ఓటీ, స్థానిక పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు ముంబై వెళుతున్న వారి కారును రామచంద్రాపురం ఇక్రిశాట్ సమీపంలో తనిఖీ చేశారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 166కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి టౌన్: గంజాయి అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్సై రవీందర్ వివరాల ప్రకారం... మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా స్కూటీపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని పట్టుకొని విచారించగా వారి వద్ద 3.8 కిలోల గంజాయి లభించింది. ఒడిశాకు చెందిన భిమల్ లోచన్, మోహన్ పండా ఇద్దరు ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి సంగారెడ్డి పరిసర ప్రాంతంలో ప్యాకెట్లు చేసి అమ్ముతున్నారు. వారి నుండి గంజాయి, సెల్‌ఫోన్లు, వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలు... చేగుంట మండలం బోనాల పిట్టల తండాకు చెందిన పిట్టల గుడ్డు (40) ఈనెల 15న రామాయంపేటలో టీవీఎస్ మోపెడ్‌పై వెళుతూ ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మరో ఘటనలో మహిళ..

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన కొండి ఎల్లమ్మ (45) తో ఇటీవల గొడవ పడ్డాడు. దీంతో ఇద్దరు నెట్టుకోవడంతో ఎల్లమ్మకు కడుపులో బలమైన గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.